రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# దోషులు ఎంతటివారైనా వదలద్దు

దళిత మహిళపై ఇంతటి అరాచకమా!

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సీరియస్

షాద్‌నగర్ రూరల్ సిఐకి ఫోన్

ఉపేక్షించవలసిన అవసరం లేదని స్పష్టీకరణ

నిందితులపై కఠిన చర్యలకు ఆదేశం



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరిగూడ మండలం ఎదిర గ్రామంలో దళిత శోభమ్మ పై హత్యా ప్రయత్నం చేసి విచక్షణ రహితంగా దాడి చేసిన దోషులను ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. ఎదిర గ్రామంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షురాలు, దళిత శోభమ్మపై అదే గ్రామానికి చెందిన మైలారం అంజయ్య, మైలారం బందయ్య, వడ్డే అశోక్, గుడుగోని పల్లి మొగులయ్యలు పథకం ప్రకారం వ్యవసాయ పురం వద్దకు పిలిచి అర్ధరాత్రి మహిళపై విచక్షణారహితంగా చేతులు కట్టి చంపేందుకు దాడిచేసిన ఘటన సంచలనం రేకెత్తించడంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వయంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఈ సందర్భంగా షాద్ నగర్ రూరల్ సిఐ శ్రీనివాస్‌తో ఫోన్లో మాట్లాడారు. సంఘటనకు సంబంధించిన విషయాలను ఆరా తీశారు. దోషులు ఎవరైనా సరే ఫిర్యాదు ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఉపేక్షించవలసిన అవసరం లేదని మంత్రి ఆదేశించారు. అదేవిధంగా జిల్లేడు చౌదరి గూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజుతో కూడా మంత్రి లక్ష్మణ్ మాట్లాడారు. సంఘటనపై వాస్తవాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల పక్షాన అండగా నిలబడాలని, న్యాయం జరిగేంత వరకు వారికి సహకరించాలని మంత్రి లక్ష్మణ్ రాజుకు తెలియజేశారు. సంఘటనపై స్పందించిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్, స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కు మండల పార్టీ అధ్యక్షుడు రాజు కృతజ్ఞతలు తెలిపారు.



## రూ.45 లక్షల విదేశీ కరెన్సీ పట్టివేత

**శంషాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** :శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా విదేశీ కరెన్సీని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. క్యాథే పసిఫిక్ విమానంలో హాంకాంగ్‌కు వెళుతున్న ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చి అతని లగేజీని స్కాన్ చేయగా, సుమారు 45 లక్షల రూపాయల విలువైన విదేశీ కరెన్సీ బయటపడింది. నిబంధనలకు విరుద్ధంగా కరెన్సీని తరలిస్తున్న సదరు ప్రయాణికుడిని అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## మరో 22

గ్రేటర్‌లో పెరగనున్న అసెంబ్లీ స్థానాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** రాబోయే ఎన్నికల నాటికి రాజధాని నగరం హైదరాబాద్, నగరాన్ని ఆనుకొని ఉన్న ఇరుగుపొరుగు జిల్లాల్లో కొత్తగా 22 అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పడ నున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల పునర్ విభజన చేసేందుకు నిర్ణయిం చడంతోపాటు 50 శాతం స్థానాలను పెంచేందుకు కేంద్రం ఓకే చెప్పడంతో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో 22 అసెంబ్లీ నియోజ కవర్గాలు పెరగనున్నాయి. ఈ మేరకు కొత్త నేతలకు అవకాశాలు లభిం చనున్నాయి. శాసనసభా నియోజకవర్గాలు, లోక్ సభస్థానాలు 50 శాతం పెరగనుండటంతో వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ప్ర స్తుతమున్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలు 183కి పెరగనున్నట్లు రాజకీయ పరిశీలకులు భా విస్తున్నారు. 2011 లెక్కల మేరకు హైదరాబాద్ జిల్లా జనాభా 39,43,323. ఒక్కో అసెంబ్లీకి సగటుజనాభా 1.93 లక్షలను పరిగణనలోకి తీసుకుంటే ఈ జిల్లాలో 20 అసెంబ్లీ సీట్లు ఏర్పాటు కానున్నాయి.

# భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తి కొనసాగాలి

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్

**కందుకూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల స్ఫూర్తితో ఇకనుండి పాలనా యంత్రాంగమంతా ప్రజల సహకారంతో ముందుకు సాగి అభివృద్ధికి బాటలు వేయాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కందుకూరు మండ లంలో గురువారం జరిగిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికలను అధికారులు చదివి వినిపించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, పరిపాలన యంత్రాంగం ప్రజలకు చేరువలో ఉండి సంక్షేమ పథకాలు అందే లా చూడాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలను భాగ స్వాములను చేయాలని సూచించారు. 15వ ఫైనాన్స్ నిధులను ప్రాధాన్యత గల అంశాలకు కేటాయించాలని, పాఠశాల స్థాయిలో అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో యువతను చైతన్యపరిచి రోడ్డు ప్రమాదాలను నివారిం చాలని, అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ఈ సమావేశంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ సరిత, తహసిల్దార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కట్టుతప్పిన నిఘా

**పెద్దేముల్ మండలంలో ఇసుకాసురుల దందా మళ్లీ పతాక స్థాయికి చేరింది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మంబాపూర్ వద్ద జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన పోలీసు చెక్ పోస్ట్‌ను వారం రోజుల క్రితం ఎత్తివేయడమే వీరికి వరంగా మారింది.**

మంబాపూర్ చెక్ పోస్ట్ ఎత్తివేత..

ఇసుక మాఫియాకు మళ్లీ ఛాన్స్

వాగుల్లో జెసిబిల జోరు!

**పెద్దేముల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలంలో ఇసుక అక్రమ రవాణా మళ్ళీ మొదటికొచ్చింది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు గత నెల మార్చి 8న మంబాపూర్ వద్ద పోలీసులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. దీనివల్ల అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తి, రవాణాకు బ్రేక్ పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే వారం రోజుల క్రితం ఈ చెక్ పోస్టును ఎత్తివేయడంతో ఇసుకాసురులు మళ్ళీ పెట్రేగిపోతున్నారు.

**రాత్రి వేళల్లో అక్రమ రవాణా**

చీకటి పడిందంటే చాలు ఇసుక మాఫియా సిండికేట్‌గా ఏర్పడి, వాగుల నుంచి జేసీబీలతో ఇసుకను తోడేస్తున్నారు. రాత్రి 10 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు తిరుగుతుండటంతో, ఆ శబ్దానికి గ్రామస్తులు కంటికి కునుకు లేకుండా గడుపుతున్నారు. ప్రధానంగా రేగొండి, రుక్మాపూర్, మన్సాన్పల్లి, మదనంతాపూర్, కొండాపూర్, బిజ్జారం వంటి గ్రామాల సరిహద్దు వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**నజరానాలిస్తున్నా..జరిమనాలేనా!**

అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ ఇసుకను రూ. 6 వేల నుండి 8 వేల వరకు విక్రయిస్తున్నారు. పెద్దేముల్ మండల కేంద్రం మీదుగా ఇసుక తరలిపోతున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఒక్కో ట్రాక్టరుకు రూ. 2 వేల నుండి 3 వేల వరకు అధికారులకు ఇస్తున్నామని యజమానులు బహిరంగంగానే చెబుతుండటం విశేషం. పట్టుబడినప్పుడు రూ. 5 వేల జరిమానా చెల్లించి, మళ్ళీ అదే దందాను కొనసాగిస్తున్నారు.

**భూగర్భ జలాలకు ముప్పు**

విచ్చలవిడిగా ఇసుకను తోడేస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం




ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవలే పోలీసులు 50 ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేసినా, అక్రమార్కులు ఏమాత్రం బెదరకుండా దర్జాగా రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**కొత్త మైనింగ్ పాలసీ వచ్చిందనే ఎత్తేశాం**

మంబాపూర్ చెక్ పోస్ట్ ఎత్తివేతపై ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ వివరణ ఇస్తూ.. కొత్త మైనింగ్ పాలసీ వచ్చినందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చెక్ పోస్ట్ ఎత్తివేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి

# హైరిస్క్ కేసులపై స్పెషల్ ఫోకస్

ప్రసవ సమయంలో మాతృ మరణాల నియంత్రణే లక్ష్యం

సేవల్లో నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

అటెండెన్స్ నమోదు తప్పనిసరి

ప్రతి కేంద్రంలో అవసరమైన మందులు ఉంచాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరి ఆదేశం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లాలోని గ్రామీణ, పట్ట ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు నిరం తరం మందులు అందుబాటులో ఉండేలా చూడా లని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమా గౌరి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఆరోగ్య కేంద్రాల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యాధి కారులు తప్పనిసరిగా ఎబిహెచ్ఎ అటెండెన్స్‌ను సమయానికి నమోదు చేసి గ్రూపుల్లో పోస్ట్ చేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రసవ సేవలను జాగ్రత్తగా నిర్వ హించి మాతృమరణాలను తగ్గించాలని, గర్భిణీలకు రక్తహీనత, హైరి స్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి కేంద్రం లో అవసరమైన మందులు ఉంచాలని, గడువు ముగియనున్న మం దుల కోసం ప్రత్యేక కార్నర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గడువు ముగిసిన మందులను నిబంధనల ప్రకారం డిస్పోజ్ చేయాలన్నారు. చిన్న పిల్లలకు టీకా కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

**ప్రైవేట్ ఆసుపత్రుల సర్వే**

జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలపై సర్వే నిర్వహించి, నెల రోజుల్లోగా నివేదికను కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మాతృ ఆరోగ్యం, పోషణ, కుటుంబ నియంత్రణ, సంక్రమణ అసంక్రమణ వ్యాధులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై అధికారులు చర్చించారు. పెండింగ్ బిల్లులు, సిబ్బంది ఖాళీలు, కాయకల్ప కార్యక్రమం వంటి అంశాలను కూడా సమీక్షిం చారు. డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వోలు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ గీత, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ లావణ్య, డాక్టర్ కౌశిక్, జిల్లా క్వాలిటీ మేనేజర్ సురేష్, వివిధ పిహెచ్‌సి, యుపిహెచ్‌ల వైద్యాధికారులు పాల్గొన్నారు.

# కాగ్నా జలాలకు గ్రీన్‌సిగ్నల్

తాండూరుకు కొత్త పైప్‌లైన్ వ్యవస్థ

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధికి సిఎం ఆదేశించారు

పట్టణంలో గ్రీన్ ఫీల్డ్, పారిశ్రామికీకరణకు పారదర్శకంగా మాస్టర్ ప్లాన్

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వెల్లడి

**తాండూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** తాండూరు మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం అనంతరం కౌన్సిల్‌లో చర్చించిన విషయాలను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. తాండూరు పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిం చేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. తాండూరుకు కాగ్నా నది నుండి కొత్త పైప్‌లైన్ వ్యవస్థ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. ఇందులో భాగంగానే పబ్లిక్ హెల్త్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు, ఇరిగేషన్, పలు శాఖల అధికారులు పట్టణాన్ని సందర్శించారని చెప్పారు. కొత్త పైప్‌లైన్ పనులు త్వరలోనే చేపట్టి కాగ్నా నది నుండి నీటిని సరఫరా చేయిస్తామని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని 36 వార్డులలో నీటి సమస్య పరిష్కారం కోసం బోర్లు, ట్యాంకులు నిర్మాణం చేపట్టేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని తెలిపారు. దీంతోపాటు పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి కూడా సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయబోతున్నారని వివరించారు. మరోవైపు పట్టణంలో గ్రీన్ ఫీల్డ్, పారిశ్రామికరణ, శిఖం భూముల్లో నివాసాలను ఒక వేదికపైకి తీసుకువచ్చి పారదర్శకంగా మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాండూరులో అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




పట్టణాభివృద్ధికి చేపడుతున్న పనులకు అనుమతి పత్రాలను చూపిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**మహిళా బిల్లుకు వంద శాతం మద్దతు..**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మరోసారి దొంగదారిలో అధికారం చేపటేందుకే డీటిమిటేషన్‌ను అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని.. దీనికి పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. అశాస్త్రీయ పద్ధతిలో జరుగుతున్న డీలిమిటేషన్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించిందని గుర్తుచేశారు.

# ఇక ఇంటర్‌లోనూ మధ్యాహ్న భోజనం

ప్రైమరీ విద్యార్థులకు అల్పాహారం

స్థానికంగా ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురండి

ప్రగతి ప్రణాళిక సభలో కలెక్టర్ దీపక్ తివారి

**కొడంగల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** స్థానికంగా నెలకొన్న సమస్య లను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణా ళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొని మాట్లాడారు. వివిధ శాఖల సమన్వయంతో నప్రజా సమ స్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అర్హులైన వారందరికీ వంద శాతం ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మహాలక్ష్మి ్మ పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు తీరుపై సమీక్షించారు. రైతు భరోసా, రాజీవ్ ఆరోగ్యశ్రీ, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరాపై చర్చించారు.

ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార రంగాల్లో ప్రోత్సాహం అంది స్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రైమరీ స్కూల్ విద్యా ర్థులకు అల్పాహారం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటి కొత్త పథకాలను ప్రభుత్వం తీసుకురాబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సుధీర్, గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, బొంరాస్‌పేట్ తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ వెంకన్న గౌడ్, సర్పంచ్ వీరేశం, ఎంపీఓ రవి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై రోడ్లు, భూ సర్వే, పంచాయతీ పనులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.




మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అంజేస్తున్న బిఆర్ఎస్ కౌన్సిలర్లు

# మున్సిపల్ ఆఫీసు ముందే ఆక్రమణల పర్వం

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారు

జోరుగా అక్రమ నిర్మాణాలు తక్షణం ఆపండి

కమిషనర్‌కు బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఫిర్యాదు

**తాండూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** తాండూరు మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఆపివేయాలని, ఆ భూములను ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలని బిఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డిని కోరారు. గురువారం బిఆర్ఎస్‌ఫ్లోర్‌లీడర్ పటోళ్ల దీప ఆధ్వర్యంలో పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సపల్ కార్యాలయం ముందు భాగంలోనే సర్వే నెంబర్ 130లో సుమారు 36గుంటల ప్రభుత్వ భూమిలో అధికార పార్టీకి చెందిన అమీర్ అబ్దుల్లా ఆక్రమంగా నిర్మాణాలు చేస్తున్నట్లు ఆరోపించారు. సుమారు 300గజాల విస్తీర్ణంలో ప్రధాన రహదారికి ఆనుకొని దుకాణాల నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదుచేశారు. ప్రభుత్వానికి చెంది ఈ స్థలానికి ఆధారాలున్నాయని చెప్పారు. అంతేకాకుండా అదే ప్రదేశంలో మరో భవనం అక్రమంగా నిర్మిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదుటే యథేచ్ఛగా ప్రభుత్వ భూమి ఆక్రమణలు, అక్రమ నిర్మణాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వే నెంబర్ 130లోని 36గుంటల ప్రభుత్వ భూమిని వెంటనే స్వాదీనం చేసుకోవాలని, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు

రేవంత్‌రెడ్డి కృషి వల్లే గాడిలో పడుతోంది

పాలమూరు నీళ్లు జిల్లా వ్యాప్తంగా తరలించటానికి చర్యలు తీసుకుంటున్నాం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్



2

రన్నింగ్ కారులో మంటలు

వాహనం పూర్తిగా దగ్ధం

డ్రైవర్ అప్రమత్తతో తప్పిన ప్రాణాపాయం

2

## బిఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జయసింహ



సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదగా నియామక పత్రం అందుకుంటున్న జయసింహ

**రంగారెడ్డి అర్బన్ ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** శంషాబాద్, కొత్వాలుగూడ డివిజన్ల బిఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా తొండుపల్లికి చెందిన రాచమల్ల జయసింహ నియమితులయ్యారు. గురువారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు.

ఈ సందర్భంగా జయసింహ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కార్తీక్ రెడ్డి నాయకత్వంలో పార్టీని బలోపేతం చేసి, ఎన్నికల్లో ఘనవిజయం సాధించేలా కృషి చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్వాలుగుడా డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ శంషాబాద్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి శంషాబాద్ జిహెచ్ఎంసి కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి జ్ఞానేశ్వర్

## ధారూర్ ప్రగతిపై సమీక్ష

**ధారూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ఇప్పటి వరకు, గత 99 రోజుల్లో మండల వ్యాప్తంగా జరిగిన వివిధ అభివృద్ధి పనులను శాఖల వారీగా సుదీర్ఘంగా వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నర్సింలు, తహసిల్దార్ సాజిదా బేగం, ఎంపీఓ సఫీ ఉల్లా ఖాన్ పాల్గొని ఆయా శాఖల ద్వారా జరిగిన పురోగతిని సమీక్షించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మాన్సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, ధారూర్ సర్పంచ్ ప్రమీల చిన్నయ గౌడ్ తో పాటు పలువురు సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజా సమస్యలపై చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ ఉషశ్రీ

## కొడంగల్‌లో పురోగతి సాధిస్తున్నాం

**కొడంగల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం పర్సాపూర్ రైతువేదికలో ఎంపీడీఓ ఉషశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులు శాఖల వారిగా పురోగతిని సమీక్షించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులను వివరించారు. సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ అలైవ్ అరైవ్ ప్రోగ్రామ్‌లు, ప్రమాదాల నివారణకు, నేరాల నియంత్రణకు, మాదకద్రవ్యాల విడకం నిర్మూలనకు ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పజలు స్వీయ చైతన్యం పొందాలని తెలిపారు.

## శ్రీనివాస్ మాస్టారి సేవలు చిరస్మరణీయం

**పెద్దేముల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు దూస శ్రీనివాస్ విద్యార్థుల భవిషత్తు నిర్మాణానికి జీవితం అంకితం చేశారని ఇందూరు సర్పంచ్ వెంకట్ కొనియాడారు. మండల పరిధిలోని ఇందూరు జడ్‌పిహెచ్ఎస్ లో పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించిన శ్రీనివాస్ సంస్మరణ సభ గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్బంగా సర్పంచ్ మాట్లాడుతూ శ్రీనివాస్ మాస్టారు క్రమశిక్షణ అంకితభావం, సేవాతత్వంతో విద్యార్థుల హృదయాల్లో చెరగని ముద్ర వేసారన్నారు. యంఈఓ నర్సింగ్‌రావు, పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు.

## మెరిట్ విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

**యాచారం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఉపాధ్యాయులు సత్కరించారు. యాచారం మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన జిల్లా జంగయ్య కుమారుడు మోక్షజ్ఞ నవోదయ, సైనిక్, గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ప్రధానోపాధ్యాయులు శ్రావణ్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే ఆరోపణలు నిరాధారం

**యాచారం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తన స్థాయిని మరిచి ఇష్టరాజ్యంగా మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ పార్టీ యాచారం మండలం అధ్యక్ష కార్యదర్శులు కర్నాటి రమేష్ గౌడ్, పాశ్చ భాష విమర్శించారు. గురువారం యాచారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని మేడిపల్లి నానక్ నగర్ తాడిపర్తి కురుమిద్ద గ్రామాల్లో అప్పటి ప్రభుత్వం ఫార్మసిటీ కోసం సేకరించిన భూముల విషయంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని మల్రెడ్డి రంగారెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య గౌడ్, సత్యపాల్, కాజు మహమ్మద్, కల్లూరి శివ, మహమ్మద్ శమీమ్, బర్ల కృష్ణ, బొల్లంపల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు,

# పథకాల విజయవంతంలో అధికారుల పాత్రే కీలకం



ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



డ్రైవర్లతో కలిసి ప్రమాణం చేస్తున్న ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు

**ఆమనగల్లు, ఏప్రిల్16, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అమలవుతున్న ప్రజాపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కొనియాడారు. గురువారం ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ ్మ గార్డెన్స్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం సాహసోపేతమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా మహాలక్ష్మి ్మ పథకం, వడ్డీ లేని రుణాలు వంటి కార్యక్ర మాలతో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందడంలో అధికారుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సముదాయంలో ఏర్పాటు చేసిన పలు ప్రభుత్వ శాఖల స్టాళ్లను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనాయక్, ఎంపీడీఓ కుసుమ మాధురి, తహశీల్దార్ ఫహీమ్ ఖాద్రి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కృష్ణనాయక్, గుండ్రాతి కుమార్‌గౌడ్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

**నియమాలు పాటిస్తేనే రోడ్డు భద్రత**

సీఐ వెంకటేశ్వర్లుప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం శ్రీలక్ష్మీ ్మ గార్డెన్స్‌లో డ్రైవర్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్ల అజాగ్రత్త వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని కోరారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని డ్రైవర్ల చేత ఆయన ప్రతిజ్ఞ చేయించారు.

**స్థానిక సమస్యలు వివరించిన సర్పంచ్‌లు**

**కడ్తాల్, ఏప్రిల్ 16, ప్రభతవార్త :** అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో ఎంబీఏ గార్డెన్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన మండల సభలో పాల్గొని మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. సర్పంచులు గ్రామాలలో సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, విద్యుత్, మంచినీటి, వసతులతో పాటు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరి స్తామన్నారు. మండలంలోని 24 గ్రామపంచాయతీలకు సంబంధించి 36 కల్యాణ లక్ష్మి ్మ షాదీ ముబారక్ ప్రజా ప్రతినిధులు అధికారులకు కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక జిల్లా అధికారి కేశరామ్, అగ్రికల్చర్ డీఈ సురేష్, ఏఎంసి చైర్మన్ యట గీత నరసింహ, వైస్ చైర్మన్ గుదురు భాస్కర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బిక్షపతి, తహసిల్దార్ జయశ్రీ, ఎంపిడిఓ సుజాత, సిఐ గంగాధర్, మండల అన్ని శాఖల అధి కారులు, సర్పంచులు కార్యదర్శులు,

## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**పెద్దేముల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేయాలని మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం పెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 99 రోజుల కార్యచరణ ప్రణాళికపై నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి సత్యనా రాయణ హజరై మాట్లాడుతూ ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, యంపిడిఓ తిరుమలస్వామి, యంఈఓ నర్సింగ్‌రావు, ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్, మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతమ్, ఏపిఎం శివయ్య,ఏపిఓ నర్సిములు, సూపరింటెండెంట్ వెంకటక్రిష్ణ, డాక్టర్ శ్వేత ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నుకొబడిన సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు.

## తట్టెపల్లిలో మొడల్ స్కూల్ ఏర్పాటు చేయాలి

**పెద్దేముల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల పరిధిలోని గిరిజన ప్రాంతమైన తట్టెపల్లిలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఓంలనాయక్‌తాండా సర్పంచ్ సుమిత్ర రాథోడ్ కోరారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఆయా గ్రామాల సర్పంచ్‌లను అన్ని శాఖల అధికారుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా సర్పంచ్ సుమిత్ర రాథోడ్ మాట్లాడుతూ తట్టెపల్లిలో స్కూల్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను దూర ప్రాంతాలకు పంపలేక పోవడంతో చదువు మధ్యలో మానేస్తున్న పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండటంతో వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోవడంతో పంట నష్టం వాటిల్లుతుందన్నారు. సమస్య పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### ధాన్యం ఆరబోసుకునేందుకు వసతి కల్పించండి

**కేశంపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** గ్రామాలలో కల్లాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని అల్వాల్ సర్పంచ్ సురేష్ రెడ్డి కోరారు. కేశంపేట మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని గురువారం కేశంపేట మండల కేంద్రంలోని నూర్ ప్యాలెస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులు జీవనాధారమైన వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తూ ఉంటారని ఆరు కాలం కష్టపడి పండించిన పంటను ఆరబోసుకునేందుకు రోడ్లపై పోసుకుంటూ ఉంటారు, వాటి ద్వారా రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు అనేక సందర్భాలలో రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే ప్రతి గ్రామంలో గ్రామ కంఠంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్లు నిర్మాణం చేపడితే రైతులు పండించిన పంటను ఆరబోసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి రమాదేవి, ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి లకు మండల పరిధిలోని సర్పంచులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించటం లేదని వికలాంగుడు ఆత్మహత్యయత్నం

**యాచారం, ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** ఇంటి స్థలం సమస్య పరిష్కారం కావడం లేదని ఓ వికలాంగుడు పెట్రోల్ పోసుకొని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఆత్మహత్యయత్నం చేసిన సంఘటన యాచారం పోలీసులు పరిధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన తెలుగమల్ల కర్ణ తన ఇంటి స్థలానికి సంబంధించిన పంచాయతీ గత మూడు నెలలుగా జరుగుతున్న ఎవరు పట్టించుకోవడంలేదని సమస్య పరిష్కరించడం లేదని స్థాపానికి గురైన కర్ణ వంటి పై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకోబోయాడు. గమనించిన స్థానికులు అప్రమత్తమై కాపాడారు.సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కర్ణకు కౌన్సిలింగ్ ఇచ్చే సమస్య పరిష్కారం జరుగుతుందని హామీ ఇచ్చారు.

### సమగ్ర అభివృద్ధి కోసం సమిష్టి కృషి

**యాచారం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** యాచారం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలు సమన్వయంతో సమిష్టిగా కలిసికట్టుగా కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచన చేశారు. బ్యాంకు లింకేజీ కింద 202526 సంవత్సరానికి గాను 781 మహిళా సంఘాలకు58 కోట్ల 2 లక్షల77 వేల రూపాయల చెక్కులను యాచారం మండలం ఓబి లకు వివిధ గ్రామాలకు చెందిన మహిళా సంఘాల లీడర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రాణి, తాసిల్దార్ అయ్యప్ప, పాల్గొన్నారు.

### విద్యుత్ ఉద్యోగుల అర్ధ నగ్న ప్రదర్శన

**షాద్‌నగర్ టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే దాకా సమ్మె ఆపేది లేదని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. పలు డిమాండ్లను ప్రజల ముందు ఉంచుతూ ఉద్యోగులు చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. డివిజన్ జేఏసీ చైర్మన్ కావాలి ఆంజనేయులు యాదవ్, కన్వీనర్ పటేల్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్ళలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు

**-రేవంత్‌రెడ్డి కృషి వల్లే రాష్ట్రం అభివృద్ధి సాధ్యం**

**-కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణి లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

**బంట్వారం, ప్రభాతవార్త :** గత పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బంట్వారం మండల స్థాయి సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వరనయంలో ప్రగతి పథంలో ముందుకెళ్తుందని అన్నారు. పార్టీలకు అతీతంగా సర్పంచ్ లకు నిధులు మంజూరు చేయిస్తానని ఆయన పేర్కొన్నారు.

**రోడ్లు మంజూరు చేయాలని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చిన నాయకులు...**

స్థానిక నాయకులు మండలానికి నూతనంగా రోడ్లు మంజూరు చేయాలనీ సభలో స్పీకర్ ను కోరారు. స్పందించిన స్పీకర్..రెండు రోజుల్లో రోడ్లకు శంకుస్థాపన పనులు మొదలుపెడతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డిప్యూటీ డిఎంహెచ్ఓ జ్యోతి, ఎఎంసీ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఎంపీడీవో రాములు, ఎంపీఓ నాగరాజు, డిప్యూటీ ఎమ్మార్వో మహేష్, మండల వైద్యాధికారి మజీత్ ఖాన్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పోచారం వెంకటేశం, మాజీ ఎంపీపీ ప్రభాకర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు బర్కత్ పల్లి విజయలక్ష్మి ్మ,సర్పంచ్‌లు సంజీవయ్య, భాగ్యమ్మ, గోరెమియా, కమలమ్మ, స్వప్న, బాలయ్య, నాయకులు హరిశ్వర్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు యాదగిరి,మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నరసింహ రెడ్డి, నాయకులు పంది వెంకటయ్య, దోరేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన మండల స్థాయి ప్రగతి నివేదికలు

**దుద్యాల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంలో అధికారులు మండల స్థాయిలో విస్తృత సభ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో మండలంలోని అధికారులు శాఖల వారీగా సాధించిన పురోగతిని మండలంలోని సర్పంచులు ఉప సర్పంచ్ ల సమక్షంలో చదివి వినిపించారు. ఎంపీడీవో జైపాల్ రెడ్డి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు ఎస్సై శ్రీశైలం మాట్లాడుతూ అరైవ్అలైవ్ ప్రోగ్రాంను 5 స్థాయిలలో నిర్వహిస్తున్నామని ప్రస్తుతం 4 స్థాయిలో ఉన్నామని ప్రమాదాల నివారణకు, నేరాల నియంత్రణకు, మాదకద్రవ్యాల వాడకం నిర్మూలనకు ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజలు సైతం స్వీయచైతన్యం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారితో పాటు ఎంపీడీవో జైపాల్ రెడ్డి, ఎంఈవో శంకర్, ఉపతహసిల్దార్ శివకుమార్, ఎస్సై శ్రీశైలం, ఆర్ఐ నవీన్ కుమార్, ఎంపీవో సత్యనారాయణ, పిహెచ్సి డాక్టర్ వందన, విద్యుత్ హౌసింగ్, మిషన్ భగీరథ ఏఈలు ఆనంద్, సుస్మిత, సాయినాథ్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ జయశ్రీ, ఏఈవో భావన, ఐకెపి ఎపిఎం రామచందర్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### వజ్రేశ్‌యాదవ్‌ను సన్మానించిన మీడియా అకాడమీ చైర్మన్

**శామీర్‌పేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

అంతాయిపల్లిలో జరిగిన టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డిని, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవిని, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డిని, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్‌లను, శ్రీనివాస్‌యాదవ్‌ను తెలంగాన మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి సన్మానించి అభినందించారు. రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జి.బాల్‌రాజ్‌గౌడ్, కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డిలు ఈ సమావేశానికి సహకరించిన వారితో పాటు శామీర్‌పేట ఉమ్మడి మండల ప్రింట్ మీడియా వారికి వారు దన్యవాదాలు తెలియజేశారు.

**..కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నందిని సిద్దారెడ్డికి ఘనంగా సన్మానం**

..అదే విధంగా ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నందిని సిద్దారెడ్డి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## నాయక్‌లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించాలి

**షాద్‌నగర్ టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరి గూడెం ప్రాంతం నుంచి వలసలు ఆగేది ఎప్పుడు?.. తమ బిడ్డలు మృతదేహాలై తిరిగి రావడం ఆగేది ఎప్పుడు? అంటూ ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాష్ నాయక్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉమ్మడి మహబూబ్నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) బృందంతో కలిసి లక్ష్మీ ్మదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, పాలకుల నిరక్ష ్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీరు లేకపోవడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల గిరిజన తండాల నుంచి వేలాది మంది యువకులు ముంబై, పుణే వంటి మహానగరాలకు వలస వెళ్తున్నారని ఆయన పేర్కొన్నారు. అక్కడ ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోయి, మృతదేహాలుగా స్వగ్రామాలకు చేరుతున్న ఘటనలు హృదయ విదారకమని ఆవేదన వ్యక్తం చేశారు.లక్ష్మీ ్మదేవిపల్లి రిజర్వాయర్ పూర్తయితేనే ఈ ప్రాంతానికి జీవం వస్తుందని, వలసలు తగ్గుతాయని ఆకాష్ నాయక్ స్పష్టం చేశారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా

## టౌన్‌షిప్ అభివృద్ధికి సహకరించాలి

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని కాచవాని సింగారం సుప్రభాత్ టౌన్‌షిప్ కాలనీ అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య, వీధిలైట్లు, వీధి కుక్కల బెడద అధికంగా ఉన్నట్లు వివరించారు. కాలనీకి మంజూరైన నిధులతో రోడ్లు, పార్కుల అభివృద్ధి చేస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇస్తూ ఇందుకు కాలనీవాసులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిఓ రాజీవ్ రెడ్డి, డిఈ నరేశ్ తదితరులున్నారు.

## టిఆర్‌విఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేష్



నియామకపత్రం అందజేస్తున్న టిఆర్‌విఎస్ నేత దుర్గాప్రసాద్

**జవహర్ నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీఆర్‌వీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొనార్ దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. జవహర్ నగర్ సూర్యనగర్‌లో జరి గిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయ న మాట్లాడాతు ఎన్నికల సమయంలో రూ.6వేలు ఆసరా పింఛన్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయక పోవడం బాధాకరమన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం అమల్లో లోపాలు ఉన్నా యని విమర్శించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుతారి రమేష్‌ను నియమిస్తూ నియా మకపత్రం అందజేశారు.



ఆవిష్కరిస్తున్న సమ్మేళన సమితి అధ్యక్షులు సుధాకర్ తదితరులు

## హిందూ సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ

**కందుకూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** కందుకూరు మండలంలో ఈనెల 21వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సమ్మేళన సమితి అధ్యక్షులు బొక్క సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హిందూ సమ్మేళనా సమితి ప్రతినిధులతో కలిసి మండల కేంద్రంలో సమ్మేళన కార్యక్రమం గోడ ప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని హిందువులంతా హిందూ సమ్మేళనా కార్యక్రమంలో పాల్గొనాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల ద్వారా హిందువుల సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సమాజంలో హిందువులు ఎదుర్కొనే ఇబ్బందులను వాటికి పరిష్కార మార్గాలను తెలియజేసుకోవడం ఐక్యతకు ప్రతిరూపాలుగా హిందూ సమ్మేళనం నిరూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఏనుగు జంగారెడ్డి, బొక్క నరసింహారెడ్డి, జిట్ట రాజేందర్ రెడ్డి, మతాల వెంకటయ్య గౌడ్, ఎగిరి సత్తయ్య, బొక్క సురేందర్ రెడ్డి, కొంచెంకూరి వెంకటేశ్వర్లు, కొలను విఘ్నేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా సామ సురేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్ టి శ్రీనివాస్ గౌడ్, ఎం ప్రవీణ్ రెడ్డి, బొక్క విఠల్ రెడ్డి అంజయ్య ఆలూరి గణేష్ వీ మహేందర్, బొక్క మనేశ్వర్ రెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనునాయక్



నియామకం పత్రం అందుకుంటున్న శ్రీనునాయక్

**ఆమనగల్లు, ఏప్రిల్16, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా రాంనుంతల సర్పంచ్ శ్రీను నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ప్రత్యేకంగా సమావేశమై ప్రజా సమస్యలు, ప్రభుత్వ తోడ్పాటుపై చర్చించిన అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మోనిక, జంగమ్మ, కోశాధికారిగా సత్యం, కార్యదర్శిగా వెంకటయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని సర్పంచులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## రన్నింగ్ కారులో మంటలు

**తప్పిన ప్రాణాపాయం**

**రంగారెడ్డి అర్బన్ ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** శంషాబాద్ పరిధిలోని సిద్ధాంతి వద్ద రన్నింగ్ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కారు పూర్తిగా దగ్ధమైంది. బుధవారం రాత్రి శంషాబాద్ నుండి ఆరంఘర్ వైపు వెళ్తున్న కారు సిద్ధాంతి సమీపంలోకి రాగానే ఇంజిన్ నుండి మంటలు ఎగిసిపడ్డాయి.



ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ వెంటనే కారును పక్కకు ఆపి బయటకు దూకడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ట్రాఫిక్ పోలీసులు కాలిపోయిన కారును పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను క్లియర్ చేశారు.



## నిబంధనలు అతిక్రమిస్తే సహించను

**ధారూర్, 16 ఏప్రిల్, ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఎస్ఐ సున్నం రాఘవేందర్ సూచించారు. ధారూర్‌లో అలైవ్ అరైవ్ కార్యక్రమంలో భాగంగా వాహనదారులతో మాట్లాడి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడుకోవడానికి హెల్మెట్ ఒక్కటే మార్గమని, అలాగే ఆర్థిక భరోసా కోసం బీమా తప్పనిసరని ఆయన వివరించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తూ, అతివేగాన్ని వీడాలని ఎస్ఐ కోరారు. నిబంధనలను తుంగలో తొక్కి నిరక్ష ్యంగా వాహనాలు నడిపే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్క రూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరిం చాలని, తద్వారా ప్రమాదాల రహిత సమాజాన్ని నిర్మించ వచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆనంద్,ప్రవీణ్, హోమ్ గార్డ్ నారాయణ, మండల కేంద్రానికి చెందిన పలువురు ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, పాల్గొన్నారు.

# ఎవరు మంచోడో మేడిపల్లిలో తేల్చుకుందాం



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తీరుపై జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. మల్‌రెడ్డి రంగారెడ్డి పాపాల పుట్ట పగిలే సమయం ఆసన్నమైందని అందుకే ఫ్రస్టేషన్‌లో అసభ్య పదజాలం వాడుతూ అబద్ధాలు వడపోస్తున్నారని ధ్వజమెత్తారు.

ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి మాట్లా డుతూ... మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిపై చేస్తున్న బురద జల్లే రాజకీయాలను వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. ప్రతి పక్షంలో ఉన్నాం.. ప్రతి దానికి ప్రశ్నిస్తాం.. సమా ధానం చెప్పే సహనం మీకు ఉండాలన్నారు. ఫార్మా సిటీ భూముల్లో అవినీతి జరిగిందని విమర్శిస్తున్న మీరు ఆ ఆరోపణలకు ఆధారాలు చూపాలని, ఈ విషయంలో నిజా నిజాలు తేల్చడానికి శుక్రవారం మేడిపల్లికి వస్తున్నాం.. అక్కడికి రా.. ప్రజా క్షేత్రంలోనే ఎవరు మంచోడో, ఎవరిది అవినీతో తేల్చుకుం దామని మల్‌రెడ్డి రంగారెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు.

# ప్రజలు మెచ్చే విధంగా పనిచేయండి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి



మోటార్ సైకిల్‌ను పంపిణీ చేస్తున్న కలెక్టర్

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల ద్వారా రక్షణ పొంది అందరూ క్షేమంగా ఉండాలి.. అదేవిధంగా ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలి.. ఈ రెండు లక్షల తోనే ఈ కార్యక్రమం ద్వారా ముందుకు సాగనున్నట్లు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. షాద్ నగర్ పట్టణంలో 99 రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వాహనాలు విపరీతంగా పెరిగి, ట్రాఫిక్ సమస్యల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించే దిశగా ప్రజలు, అధికారులు, పోలీసులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. హెల్మెట్ పెట్టుకోవడం నామోషీగా భావించకుండా ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడకం ద్వారా ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగంగా వెళ్లడం వంటివి నివారించుకోవాలని అన్నారు. ఇలాంటివి చేసుకోకుండా పోలీసులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇక సంక్షేమ పథకాల విషయానికి వస్తే షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం యుద్ధప్రాతిపదికన కొనసాగుతుందని, వర్షాకాలం వస్తే ఇబ్బందులు ఎదురవుతాయని ఉద్దేశంతో వేసవిలోనే అన్ని ఇండ్లను పూర్తిచేసే లక్ష ్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి ్మ, షాదీ ముబారక్ వంటివి వివాహం జరిగిన వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని సూచించారు. ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు నూటికి నూరు శాతం వారికి అందినప్పుడే ఫలితాలు ఉంటాయన్నారు.




పూడూరు మండల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు విజయ్‌కుమార్,తదితరులు

# ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

**మండల ప్రత్యేక అధికారి డా.సదానందం**

**పూడూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి డా.సదానందం పేర్కొన్నారు.ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో మండలస్థాయి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.తహశీల్దారు విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు,కళ్యాణ లక్ష్మీ చెక్కులతోపాటు సన్నబియ్యంవంటి పథకాలను అందజేయడం జరిగిందని వివరించారు. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డుభద్రతపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వివరించారు.వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్,సీటు బెల్టులు తప్పకుండా ధరించాలని సూచించారు.మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని,వారికి వాహనాలు ఇచ్చిన వారిపైకూడా కఠిన చర్యలు ఉంటాయన్నారు.ఎంపిడిఓ పాండు మాటా డుతూ స్థానికంగా ఉండే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంకోసం ప్రణాళికను తయారు చేసుకోవాలని సూచించారు.మండల విద్యాధికారి సాయిరెడ్డి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి మౌలిక వసతుల కల్పన,విద్యార్థులకు అల్పాహారంతోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందజేయనుందని వివరించారు.జూన్ 12వతేదిన విద్యార్థులకు ఎడ్యూకేషనల్ కిట్లు అందజేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మకమిటి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి,మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బి.శ్రీనివాస్‌రెడ్డి,ఉపాధ్యక్షులు ఖిజర్‌పాష,సర్పంచులు దయాకర్,భూపతిరెడ్డి,ఎంపిఓ సుందర్,పలు గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శులు,పలు శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మండల సమస్యలను పరిష్కరిస్తాం

**-ఈఈ ఉమేష్ కుమార్- చౌడపూర్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండలస్థాయి సమావేశం**




సమావేశంలో పాల్గొన్న అధికారులు,సర్పంచ్‌లు,నాయకులు

**చౌడపూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**
ప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రణాళిక, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా,చౌడపూర్ మండల కేంద్రంలో మండలస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. గురువారం , మండల ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు,సర్పంచులతో మండలస్థాయి సమావేశాన్ని నిర్వహించారు.మండల ప్రత్యేకాధికారి , ఈఈ ఉమేష్ కుమార్ సమావేశానికి హాజరై,సర్పంచుల నుండి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల వారిగా మండలంలో సాధించిన ప్రగతి ప్రణాళికను ప్రజలకు వివరించారు.ప్రభుత్వ పథకాలకు సంబంధించి మండలంలోని గ్రామాల వారిగా లబ్దిదారుల వివరాలను అధికారులు తెలిపారు.హాజరైన ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ రోడ్ల సమస్య,మండల భవనాల నిర్మాణాల వంటి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు..ఈఈ ఉమేష్ మాట్లాడుతూ , మండల కేంద్రంలో కావలసిన నూతన మండల కార్యలయాలకు సంబంధించి ,భవనాల నిర్మాణాల సమస్య గురించి పై అధికారులు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు..మండలపరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన రోడ్డు మార్గాల నిర్మాణలకై నిధులు కూర్చే విధంగా ప్రయత్నిస్తామని,ప్రధానమైన రోడ్ల సమస్యపై పరిష్కారం చూపే విధంగా పనిచేస్తామన్నారు..మండల పరిధిలోని విద్యా,వైద్యం, అంగన్వాడీ, త్రాగునీరు, మిషన్ భగీరథ లాంటి సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు.. ఈ సమావేశంలో ఎంపిడిఓ సోమలింగం, తహశీల్దారు వెంకటేశ్వర్లు, విద్యాధికారి రాంచందర్, ఇంచార్జ్ ఎంపిఓ రాజిరెడ్డి , మిషన్ భగీరథ ఏఈ అభిలాష్ , విద్యుత్ శాఖ ఏఈ మోతిలాల్ , ఏఓ పరిమళ, పిఆర్ఏఈ శివ , ఎపిఓ చంద్రశేఖర్ , సూపరిండెంట్ రమేష్ , వివిధ గ్రామాల సర్పంచులు , నాయకులు , మహిళా సంఘాలు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థలం ఏర్పాటు

**తలకొండపల్లి ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం గురువారంనాడు స్థలాన్ని ఏర్పాటు చేసినట్లు తాసిల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. గత సంవత్సరం తలకొండపల్లి మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడంతో కాలేజీకి ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు దాతలు ముందుకు వచ్చారు. కానీ ప్రభుత్వ స్థలం గుర్తించకపోవడంతో గత సంవత్సరంగా జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ఆవరణంలోనే జూనియర్ కళాశాలను నడిపారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నాడు తాసిల్దార్ రమేష్ కుమార్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావుకు తలకొండపల్లి మండల కేంద్రంలో కళాశాల కోసం స్థలాన్ని మంజూరు ప్రొసీడింగ్ అందజేశారు. తలకొండపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 291 లో 2.37 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రభుత్వ భవనాలు నిర్మించుకోవాలని భూమికి సంబంధించిన ప్రొసీడింగును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ రమేష్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, ఆర్ ఐ శ్రావణ్ కుమార్, కళాశాల డ్రైవ్ ఇన్చార్జి షణ్ముఖ రెడ్డి, కళాశాల బృందం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి మృతి ఆర్థిక సాయం

**తలకొండపల్లి ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామానికి చెందిన శానముని జంగయ్య(62), అనే వ్యక్తి బుధవారం సాయంత్రం మృతి చెందాడు. జంగయ్య గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఇంటి వద్దనే ఉన్నాడు. ఈనెల 15న అకస్మాత్తుగా ఇంటిలో మృతి చెందాడు. గురువారం నాడు మృతుని కుటుంబ సభ్యులను, జర్నలిస్ట్ నాయకులు దర్వుల శంకర్, మాజీ ఉపసర్పంచ్ షానముని నరేష్ రాజులు పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ధైర్యం తెలుపుతూ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి 3000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. మృతి చెందిన జంగయ్యకు ఇద్దరు భార్యలు పార్వతమ్మ ఇందిరమ్మతోపాటు కుమారులు రామస్వామి మహేష్లు ఉన్నారు.

## గోడను కూల్చి కబ్జాకు యత్నించిన ఘటనపై ఫిర్యాదు

**టిఎన్‌జిఓస్ రాష్ట్ర,జిల్లా నాయకులు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



టిఎన్‌జిఓస్ మేడ్చల్ జిల్లా కార్యాలయం భవన కాంపౌండ్ వాల్ గోడను కూల్చి కొందరు ప్రైవేట్ వ్యక్తులు కబ్జాకు ప్రయత్నం చేసిన ఘటనపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్‌రెడ్డికి టిఎన్‌జిఓస్ రాష్ట్ర, జిల్లా నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. గురువారం సైబరాబాద్ సిపిని కలిసి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై సిపి స్పందించారని సమస్యను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు టిఎన్‌జిఓస్ నాయకులు తెలిపారు. సైబరాబాద్ సిపి రమేశ్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసిన వారిలో టిఎన్‌జిఓస్ కేంద్ర సంఘం అధ్యక్ష,కార్యదర్శులు మారాం జగదీశ్వర్, సయ్యద్ ముజీబుహుస్సేన్, కోశాధికారి సత్యనారాయణగౌడ్, అసోసియేట్ ప్రసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బి.రవిప్రకాశ్, కార్యదర్శి భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డికి ఘన సన్మానం

**చేవెళ్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఘనంగా సన్మానించారు. గురువారం ఢిల్లీలో రాజ్యసభ సభ్యునిగా వేం నరేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన ఆనందరం ఢిల్లీలోని పార్లమెంట్ అవరణలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య బృందం శాలువా, పూల మాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్,వైస్ చైర్మన్ రాములు, ముడిమ్యాల సహకార సంఘం మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ,చేవెళ్ల సహకారం సంఘం మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్,ప్రభాకర్‌రెడ్డి, సినియర్ కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి,మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి,సర్దార్ నగర్ మార్కెట్ కమిటి చైర్మన్ సురేందర్‌రెడ్డి,పామెన కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ మంగళి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యునిగా వేం నరేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన ఆనంతరం ఢిల్లీలోని పార్లమెంట్ అవరణలో శాలువా, పూలమాలతో సత్కరించిన చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య

# విద్యుత్, మంచినీటి సమస్యలను పరిష్కరించాలి

**..అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి**
**మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ సభ**
**..ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సందర్భంగ జరిగిన సభ**

**శామీర్‌పేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
అలియాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న విద్యుత్, మంచినీటి సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంతం శిరీషకృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా మున్సిపల్ స్థాయి సభ ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందివ్వటం జరుగుతుందని అవసరం ఉన్నవారు ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో విద్యుత్ సమస్యలు ఉన్నట్లు పలువురు దృష్టికి తెచ్చినందున వాటిని పరిష్కరించ టానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. తుర్కపల్లి, లాల్‌గడ మలక్‌పేట్ గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య ఉందని పలువురు కౌన్సిల్ సభ్యులు తెలిపినందున అధికారులు సందర్శించి వెంటనే సమస్యను తీర్చటానికి తగు చర్యలు తీసుకోవా లన్నారు. ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా పలు సంక్షేమ పథకాలు చేయూత పిన్షన్, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, డ్వాక్రా మహిళలకు రుణాలు, స్త్రీశక్తి క్యాంటీన్లు, వ్యవసాయశాఖ పలు అంశాల గురించి సభలో వివరించారు. జిల్లా, మండల, మున్సిపల్ సంబంధిత శాఖల అధికారులు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సభలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కంతం శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న వైస్‌చైర్మన్, కమిషనర్ తదితరుల దృశ్యం

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్**

**కొడంగల్,ఏప్రిల్ 16,ప్రభాతవార్త:**
విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నదని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు.ఇటీవలే వెలువడిన ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి టాపర్‌లుగా నిలుచిన కెజిబివి కళాశాల విద్యార్థినిలను గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నాడని,అందులో భాగంగా వసతి గృహం విద్యార్థులకు సన్న బియ్యం,కాస్మోటిక్ చార్జీలు అందించడం జరుగుతుందన్నారు.అంతేగాక కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాలతో కూడిన అల్పాహారం అందించడం జరుగుతుంద న్నారు.మరోపక్క బాలికల విద్యకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నదని గుర్తు చేశారు.వచ్చే విద్యా సంవత్సరం నుండి ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో మరింతగా రాణించాలన్నారు.అనంతరం అత్యధిక మార్కులు సాధించి టాపర్‌లుగా నిలిచిన విద్యార్థినిలు జీ.శిరీష, అనంద,కీర్తన,భవానీ,అనుష,వర్ష తదితరులను సన్మానించి అభినందించారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్‌నాయక్,కౌన్సిలర్‌లు కుశగారి రాజశేఖర్,బత్తుల అనిత నర్సింహ,సుష్మదామోదర్,కృష్ణంరాజు,హమీద్,మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌లతో పాటు కస్తూర్బా కళాశాల ప్రిన్సిపాల్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్‌లో ఉత్తమ మార్కులతో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థినిలను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మేన్ తదితరులు

# మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యం

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 16,(ప్రభాతవార్త):**
మహిళలను పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండలంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10ఏళ్లలో ఎక్కడ అభివృద్ధి చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండునర ఏళ్లలో ఎంతో అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఉమ్మడి కొందుర్గు మండలంలో 250కోట్లతో ఇంటిగ్రెటెడ్ పాఠశాల నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. 5కోటన్ల 36లక్షలతో హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పెర్కొన్నారు. మండలంలో 509ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయశామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి 30ఇళ్లు ఇస్తామని అన్నారు. నియోజకవర్గంలో 46వేల మహిళలకు బతుకమ్మ చీరలు ఇచ్చిమని ఆయన పెర్కొన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నట్లు ఆయన తెలిఎపారు. వచ్చే జూన్ రెండవ తేదిన రెండు లక్షల కొత్త పిన్షన్లను రాష్ట్ర ప్రభుత్వం అందించనున్నట్లు ఆయన పెర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఆయన తెలిపారు. అనంతరం మహిళ సంఘాల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ తహసీల్దారు జగదీశ్వర్, వ్యవసాయ అధికారి రాజెందర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్వేత, చంద్రశేఖర్, రాంచంద్రయ్య, నర్సింహులు, బందయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, ధామోదర్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, అంజనేయులు, పురుశోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహిళ సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## చింతకుంటతండాలో బోర్లు వేయించిన మాజి ఎమ్మెల్యే

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 16,(ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండలం చింతకుంట తండాలో నెలకొన్న త్రాగునీటి సమస్యపై గ్రామప్రజలు చేసిన వినతికి వెం టనే స్పందించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రెండు బోర్లు వేయించారు. నీటి కోసం ఇబ్బం దులు పడుతున్న తండా ప్రజలకు ఇది పెద్ద ఊరటగా మారింది. పదవి లేకపోయినా ప్రజల పట్ల తన బాధ్యతను ఎప్పటికీ మర్చి పోని నాయకుడిగా మాజి ఎమ్మెల్యే ఉన్నారని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్ అన్నారు. గ్రామ ప్రజల కష్టాన్ని తమ కష్టంగా భావించి, తక్షణమే స్పందిస్తూ అవసరమైన సహాయం అందించడం ప్రత్యేకతగా నిలుస్తోందని ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాములు,సత్య ప్రమోద్, జిల్లెడు వెంకటేష్, కొండి యాదయ్య, రాంచరణ్, మోహనచారి, దామోదర్ రెడ్డి, వెంకట్రాములు, వెంకటయ్య, కన్న జంగయ్య, రవి నాయక్,శేఖర్, మాజీ ఎంపీటీసీ మాణయ్య, రాజు నాయక్, కె. నర్సింలు, కన్న మల్లేష్, ఘనపూర్ నర్సింలు, ధీమ గణేష్, కిషన్ నాయక్, సంజీవ రెడ్డి, జోగు రాములు, జహంగీర్, సలీం, మోతిలాల్ నాయక్, శివరాజ్, బాలరాజు, బి. నర్సింలు, లాలు, లింగమయ్య, వీర్య నాయక్, సంతోష్, అమీర్, ఆంజనేయులు, వినోద్, మహేష్, చందు తదితరులుపాల్గొన్నారు.



తాండాలో బోరు వేయిస్తున్న నాయకులు

**కొందుర్గు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా**

## టి. విక్రమ్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక..

**కొందుర్గు, ఏప్రిల్ 16:** మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొందుర్గు మండలంలోని గంగన్నగూడ గ్రామ సర్పంచ్ టి. విక్రమ్ రెడ్డిని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మండలంలోని సర్పంచులందరూ సమిష్టిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని కూడా ప్రకటించారు.నూతన కార్యవర్గ వివరాలు

**మండల అభివృద్ధి మరియు సర్పంచుల సంక్షేమం ధ్యేయంగా**

**ఈ క్రింది వారు బాధ్యతలు స్వీకరించారు:**

అధ్యక్షులు.,టి. విక్రమ్ రెడ్డి (గంగన్నగూడ సర్పంచ్), ఉపాధ్యక్షులు: గోపాల్ నాయక్,ప్రధాన కార్యదర్శి: బోయ అశోక్ (పర్వతాపూర్ సర్పంచ్),కార్యదర్శి: చర్లగూడ శారద నర్సింలు (లాలాపేట్ సర్పంచ్),కోశాధికారి: రాజు, పత్తి శ్రీశైలం, జ్యోతి కార్యవర్గ సభ్యులు: పసుపుల అనుష అమరేందర్ రెడ్డి, బేగరి రమేష్, మల్లని యాదయ్య.

**సమస్యల పరిష్కారమే నా ధ్యేయం: విక్రమ్ రెడ్డి**

నూతన అధ్యక్షులు విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మండలంలోని సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి, అలాగే మండల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ సంఘం బలోపేతానికి పాటుపడతానని పేర్కొన్నారు

.పాల్గొన్న ముఖ్య నాయకులు:ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జాంగిర్, పద్మా రెడ్డి, టి. కృష్ణారెడ్డి, రవి, రమేష్, జ్యోతి, శ్రీనివాస్ రెడ్డి, జంగమ్మ, శేఖర్ రెడ్డి, యాదయ్య, యాదమ్మ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.



చేవెళ్ల మండ కేంద్రంలోని అరుణ గార్డెన్‌లో మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కును అందజేసిన చేవెళ్ళ రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహ రెడ్డి

## గ్రామ పంచాయతీ నిధులు సక్రమంగా వినియోగించాలి

**-ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు**
**-చేవెళ్ళ రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహ రెడ్డి హెచ్చరిక**

**చేవెళ్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ నిధులు సక్రమంగా వినియోగించాలని, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని చేవెళ్ళ రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహ రెడ్డి హెచ్చరించారు. గురువారం చేవెళ్ల మండ కేంద్రంలోని అరుణ గార్డెన్‌లో పంచాయతీ కార్యదర్శులకు, ప్రజా ప్రతినిధులకు అధికారులకు నిధులు ఏవిధంగా వ్యయం చేయాలని అవగాహన సదస్సును నిర్వహించారు.మండలంలోని 570 మహిళ సంఘాలకు రూ.60,40,190 వడ్డీలేని రుణాలను, 480 సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.35,80,00,000 రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ళ రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు సక్రమంగా నిధులు వ్యయం చేయాలన్నారు. సంక్షేమ పథకాల నిధులు పక్కదారి మళ్లితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామాలల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. గ్రామాలను అభివృద్ధివైపు తీసుకు వెళ్లాల్సిన భాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం చేయూత నిస్తుందన్నారు. గ్రామాలు అభివృద్ధి సాధించాలంచే అధికారులు ప్రజా ప్రతినిదుల సమిష్టిగా పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపిడిఓ హిమబిందు,తహసీల్దార్ క్రిష్ణా,సిఐ భూపాల్ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు అవగాహన సదస్సు

**కేశంపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**
కేశంపేట మండల కేంద్రంలోని నూర్ ప్యాలెస్‌లో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై మండల పరిధిలోని ప్రజలకు నాయకులకు ప్రత్యేక అవగాహన సదస్సులు మండల ప్రత్యేక అధికారి రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో పారిశుద్ధం, మంచినీటి వసతి, ఇందిరమ్మ గృహ నిర్మాణాలు, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, మహిళా సంఘాల భవనాలు, ఆర్ అండ్ బి రోడ్లు, తదితరవాటిపై మండల స్థాయి అధికారులుతో ప్రజలకు వివరించారు. అనంతరం ఎంపిఇడిఓ రవిచంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి సమస్యలు లేకుండా పరిపాలనను సాగించాలని ప్రభుత్వం ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించిందని ఆయన అన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు ఏపిఎం కవిత ఆధ్వర్యంలో చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక తహసిల్దార్ రాజేందర్ రెడ్డి, నరహరి, ఎంపిఓ కిష్టయ్య, ఎపిఎం కవిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశం, కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు గుండె రాణి, మండల పరిధిలోని సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, ఆశా వర్కర్లు, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రమాదేవి

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరే విధంగా కృషి చేయాలి

**మహేశ్వరం, ఏప్రిల్ 16, (ప్రభాతవార్త) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల పాటు చేపడుతున్న కార్యాచరణతో గ్రామాలలో సమగ్ర మార్పు తీసుకురావాలని ఎంపిడిఓ శైలజా రెడ్డి తెలిపారు. గురువారం మహేశ్వరం మండల పరిధిలోని కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మండల స్థాయి ప్రజా పాలన కార్యక్రమంలో ఎంపి ఓ రవీందర్ రెడ్డితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శైలజా రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6 నుండి ప్రతిష్టాత్మకంగా 99 రోజుల పాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను ప్రారంభించిందని ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమాలను విజయవంతం చేయడం జరుగుతుందని అన్నారు. నూతనంగా ఎంపికైన గ్రామ సర్పంచులు గ్రామాలలో సమర్థవంతంగా పాలనను అందించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని అన్నారు. గ్రామాలలో పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేయడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో పెయింటింగ్, శానిటేషన్, వీధి దీపాలు, నీటి ఎద్దడి నివారణ, మల్టీపర్పస్ వర్కర్లకు సమయానికి వేతనాలు చెల్లింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ గంజాయి మత్తు పదార్థాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, సిఐ రాఘవేందర్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ నరేష్, ఏవో నాగమణి, ఏఈ రాంప్రసాద్ రెడ్డి, ఏపీవో సంతోష్ కుమార్, ఏపిఎం పరిమళ, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ సబ్ ఇంజనీర్ భార్గవ్, దుబ్బచర్ల వైద్యాధికారి కల్పన, ఎంఈఓ కస్నానాయక్ సర్పంచులు మునగపాటి నవీన్, జగన్ మోహన్ రెడ్డి, బండారి లింగం, ధార నరసింహ, చేపంగి ప్రవీణ్, తుమ్మటి అండాలు, బక్కని లక్ష్మమ్మ, భామిని దేవ్లా నాయక్, నెనావత్ రాజు నాయక్, మంజుల చత్రు నాయక్, రాజు నాయక్, దేవేందర్ నాయక్, అరుణ గోపాల్ నాయక్, యాదమ్మ, పోతుల మల్లమ్మ, జ్యోతి మోతిలాల్, లిల్లీ మేరీ స్లీవారెడ్డి పంచాయతీ కార్యదర్శులు, అంగన్ వాడి టీచర్లు, ఆశాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ శైలజా

## మహేశ్వరంలో బిఆర్ఎస్‌కి తిరుగులేదు

**మహేశ్వరం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఆవిర్భవిస్తుందని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి తెలిపారు. గురువారం అకాన్ పల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు బొల్లెపాక సంజీవ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి అకాన్ పల్లి గ్రామ సర్పంచ్ జ్యోతి కుమార్ నాయక్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామంలో బిఆర్ఎస్ పార్టీని పటిష్ట పరచాలని ఆమె సూచించారు. పార్టీలో చేరిన వారు బొల్లెపాక బాలయ్య, జంగయ్య, ఎర్ర వినయ్, రాజు, గణేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య గౌడ్ నాయకులు నరసింహ, సంతోష్, దేవేందర్, ఎర్ర శ్రీకాంత్, ముక్కెర శంకర్, జంగయ్య, అంజయ్య, కుమ్మరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో ఎమ్మెల్యే సబిత

## నీటికి ఇబ్బందులు..బోర్‌మోటారు ఏర్పాటు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో నీటిసమస్య పరిష్కారానికి కొత్త బోర్ మోటార్ ఏర్పాటు చేశారు. అంబేద్కర్‌నగర్‌లోని కామునికంత వద్ద బోరు పనిచేయకపోవడంతో స్థానికులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యను కాలనీవాసులు ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి కొత్త 1హెచ్‌పి మోటార్‌ను కొనుగోలు చేసి మరమ్మత్తులు చేయించారు. మున్సిపల్ సిబ్బంది చెడిపోయిన మోటార్‌ను తొలగించి కొత్త బోర్‌మోటార్‌ను బిగించారు. కొత్త బోర్‌మోటార్ ద్వారా నీరు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎర్లీ బర్డ్ స్కీమ్‌తో ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులందరికీ ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ పొందవచ్చని ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి తెలిపారు. ప్రజలు ఏప్రిల్ 30వ తేదీ లోపు 2026 ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం పన్ను చెల్లిస్తే రాయితీ లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. గత సంవత్సరం బకాయిలను కూడా పూర్తిగా చెల్లించాలని తద్వారా రాయితీకి అర్హత పొందవచ్చని తెలిపారు. మైక్యూర్ మొబైల్ యాప్, ఎంఎంసి అధికారిక వెబ్‌సైట్: ఎంఎంసి.తెలంగాణ.జిఓవి.ఇన్ లో సంబంధిత సర్కిల్ సిటిజన్ సర్వీస్ సెంటర్లు, మీసేవా కేంద్రాలలో ప్రజలు ముందస్తు పన్నులు చెల్లించి ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని డీసీ వాణి సూచించారు.

# దౌల్తాబాద్ వెంకన్న ఆలయ పునర్నిర్మాణానికి మహర్దశ

-రూ.1.75 కోట్లు మంజూరు
-ప్రభుత్వ ప్రత్యేక నిధుల నుంచి నిధుల విడుదల..
-హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు

**దౌల్తాబాద్,ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనుల్లో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్లానింగ్ విభాగం విడుదల చేసిన జిఓ.ఆర్టి నం.83 ప్రకారం..రూ.175.00 లక్షల(ఒక కోటి డెబ్బై ఐదు లక్షల రూపాయల)నిధులను ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్) 2026-27 కింద కేటాయించింది. ఈ నిధులతో ఆలయ పునర్నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో పూర్తి చేయనున్నారు.



దౌల్తాబాద్ సర్పంచ్ బి.శ్రీనివాస్‌రెడ్డి

**త్వరలోనే పనులు ప్రారంభం:**

ఈ నిధులను వినియోగించి ఆలయ పనులను వేగవంతం చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించిందని, దేవాదాయ శాఖ పర్యవేక్షణలో, సాంకేతిక అనుమతులు పొందిన వెంటనే ఈ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్‌రావు తెలిపారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా, నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేసేలా చొరవ తీసుకుంటామని అన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్‌రావు

**భక్తులు,గ్రామస్థులు హర్షం:**

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆలయ పనులకు నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక భక్తులు,గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకుంటే ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు:**
**-బత్తుల శ్రీనివాస్‌రెడ్డి(దౌల్తాబాద్ సర్పంచ్)**

శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.75 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల మేము ఎంతో సంతోషిస్తున్నాము. నిధుల విడుదల కోసం కృషి చేసిన ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు ధన్యావాదాలు. ఈ నిధులతో ఆలయ పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షిస్తాం. మా గ్రామ ఆధ్యాత్మిక శోభ పెరగడం గర్వకారణం.

# బొంరాస్‌పేటలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి
విద్యార్థినిలకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

**కొడంగల్,ఏప్రిల్ 16 ,ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం బొంరాస్‌పేట్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేవారు. రిజిస్ట్రర్లు అన్ని చెక్ చేశారు. లేబర్ రూమ్, ఇన్ పెషెంట్, ల్యాబ్ రూమ్‌లన్ని చూశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి వస్తున్నారా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరిపోయే మందులు అందుబాటులో ఉన్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రతి రోజు ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ ఎంత మంది పేషంట్లు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు చెకప్‌కు ఎంతమంది వస్తున్నారని, అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయా, అంబులెన్స్ సౌకర్యం ఉందా, ప్రతి నెల ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండే అన్ని మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకొని, ప్రభుత్వ ఆసుపత్రిలో సాదారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా డాక్టర్లు కృషి చేయాలన్నారు. ఆసుపత్రిలో మందులు కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం బొంరాస్ మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంత అమౌంట్ వచ్చింది, ఇంకా ఎంత రావాలి, ఎప్పటి వరకు పూర్తి చేస్తారు. త్వరితగతిన నిర్మాణం పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ సుధీర్, గ్రంధాలయ చైర్మేన్ రాజేష్‌రెడ్డి, బొంరాస్‌పేట్ తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ వెంకన్నగౌడ్, డాక్టర్ హెమంత్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థినిల ఆరోగ్యం, విద్యాపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్ దీపక్ తివారి**

విద్యార్థినిల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం భోజనం ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం బొంరాస్‌పేట్ గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠవాలను సందర్శించారు. ఈ సందర్బంగా గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థినిల విద్యా ప్రమాణాలు, ఆరోగ్య



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దీపకన తివారి

పరిస్థితులను సమీక్షించారు. తరగతి గదులను పరిశీలించి బోధన విధానాన్ని పరిశీలించారు. విద్యార్థినిలతో నేరుగా మాట్లాడి వారి చదువు, సౌకర్యాలు, ఆరోగ్య సమస్యలపై సమాచారం సేకరించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, పోషకాహారం, తాగునీరు, వసతి సౌకర్యాలపై ఎటువంటి లోపాలు ఉండకూడదని సంభందిత అధికారులను ఆదేశించారు. ఆరోగ్య పరీక్షలను నిరంతరం నిర్వహించి, విద్యార్థినిల ఆరోగ్యంపై పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. సిబ్బంది, విద్యార్థుల హాజరు నమోదు రిజిస్ట్రర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినుల వ్యక్తిగత అభివృద్ధి, క్రమశిక్షణ, నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని తెలిపారు. మధ్యాహ్న హోజనాన్ని పరిశీలించి, విద్యార్థినిలతో పాటు కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ వెంకన్నగౌడ్, ఎంఈఓ హరిలాల్, వార్డెన్ రాజన్న, ఉపాధ్యాయులు, సంభంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థలం ఏర్పాటు

**తలకొండపల్లి ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం గురువారంనాడు స్థలాన్ని ఏర్పాటు చేసినట్లు తాసిల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. గత సంవత్సరం తలకొండపల్లి మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడంతో కాలేజీకి ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు దాతలు ముందుకు వచ్చారు. కానీ ప్రభుత్వ స్థలం గుర్తించకపోవడంతో గత సంవత్సరముగా జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల ఆవరణంలోనే జూనియర్ కళాశాలను నడిపారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నాడు తాసిల్దార్ రమేష్ కుమార్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావుకు తలకొండపల్లి మండల కేంద్రంలో కళాశాల కోసం స్థలాన్ని మంజూరు ప్రొసీడింగ్ అందజేశారు. తలకొండపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 291 లో 2.37 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రభుత్వ భవనాలు నిర్మించుకోవాలని భూమికి సంబంధించిన ప్రొసీడింగును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ రమేష్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, ఆర్ ఐ శ్రావణ్ కుమార్, కళాశాల డ్రైవ్ ఇన్చార్జి షణ్ముఖ రెడ్డి, కళాశాల బృందం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సమస్యల వెల్లువ

**తల కొండపల్లి ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం నాడు నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల ప్రత్యేక అధికారి నాగరత్నం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. స్థానిక దేవకి గార్డెన్లో నిర్వహించిన ఈ సమావేశంలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తల కొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, చెన్నారం సర్పంచ్ రాత్లావత్ రజిత రాజు నాయకులు, మాట్లాడుతూ గ్రామాలలో ఇంకా కొన్ని అభివృద్ధి పనులు మిగిలిపోయి ఉన్నాయని, విద్యుత్ స్ట్రీట్ లైట్లు, మిషన్ భగీరథ కొన్ని గ్రామాల్లో సరిపోను వాటర్ రావడం లేదని అన్నిటిని సరి చేయాలని కోరారు. మండలంలో వైద్యాధికారులు అందుబాటులో ఉండడం లేదని , అధికారులు వేళలు తప్పకుండా సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని పలువురు కోరారు. స్థానిక సీఐ జానకిరామ్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత చర్యలపై అధికారులకు ప్రజాప్రతినిధులకు బాధ్యతలు వివరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక అంగన్వాడి ఆధ్వర్యంలో స్టాల్లు ఏర్పాటు చేసిన అధికారులు తమకు అవకాశం ఇవ్వలేదని ప్రత్యేక అధికారికి మొరపెట్టుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయాల కతీతంగా లబ్ధిదారులందరికి అందరికీ బిల్లు ఇవ్వాలని ఇందులో అధికారులు పక్షపాతం తప్పకుండా చూడాలని తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ కోరారు. అనంతరం తలకొండపల్లి మాజీ సర్పంచ్ పెరుమళ్ళ లలిత జో తయ్య, పడకల్ మాజీ ఎంపిటిసి జోగు రమేష్ లు తలకొండపల్లి నుంచి పడకల్ వెళ్లే రోడ్డులో ముల్ల కంప చెట్లు పెరిగి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, పడకలతోపాటు గోదాం, డంపింగ్ యార్డ్ తదితర పనుల కోసం వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నట్లు మండల ప్రత్యేక అధికారి నాగరత్నంకు తెలిపారు. వెంటనే ఈ రోడ్డుపై గల ముళ్ళకంప చెట్లను తీయించాలని వారు వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగరత్నం, ఎంపీడీవో శ్రీకాంత్, తాసిల్దార్ రమేష్ కుమార్, స్థానిక సీఐ జానకిరామ్ రెడ్డి, వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని తో పాటు ఆయా శాఖల అధికారులు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

300 కుటుంబాల జీవనోపాధి పెంపునకు సెర్ప్ శ్రీకారం

**దౌల్తాబాద్,ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని రైతుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకువచ్చే లక్ష్యంతో సమీకృత వ్యవసాయ క్లస్టర్(ఐఎఫ్‌సీ) కార్యక్రమం వేగవంతమైంది. సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా గురువారంరోజు ఈర్లపల్లి గ్రామంలో రైతులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల

**మూడు గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణ:**

మండలంలోని ఈర్లపల్లి, గోకఫ స్లావాద్, బండివాడ గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఎంపిక చేసి, సుమారు 250 నుండి 300 రైతు కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. ఏప్రిల్ 16,17,18 తేదీలలో వరుసగా మూడు రోజుల పాటు ఆయా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, వాసన్ సంస్థ సాంకేతిక సహకారంతో సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నారు అధికారులు తెలిపారు.

**సహజ వనరులతోనే సుస్థిర ఆదాయం:**

ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ..గ్రామాల్లో అందుబాటులో ఉన్న సహజ వనరులను ఆధారంగా చేసుకుని, ఖర్చు తగ్గించి ఆదాయం పెంచుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వాసన్ సంస్థ ప్రతినిధులు సాంకేతిక అంశాలపై రైతులకు ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సంస్థ నుండి ఎంఎంఎస్ ప్రతినిధులు, ఏపీఎం వెంకన్న, సీసీలు బాల్‌రాజ్, రామకృష్ణ, వాసన్ సంస్థ నుండి ప్రోగ్రామ్ అసోసియేట్స్ సొండె. గోపాల్, మ్యాక్స్ సీఈఓ పోతుల బుగ్గప్ప, ప్రకృతి వ్యవసాయ రైతు పల్లె సాయిరెడ్డి, ఈర్లపల్లి గ్రామ సర్పంచ్ బి.పద్మమ్మ వెంకట్రాములు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, రైతులు, మహిళాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

## దొంగతనం అడ్డుకున్న మహిళపై హత్యాయత్నం

**దౌల్తాబాద్,ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** ఇంట్లోకి చొరబడిన దొంగను ఎదిరించినందుకు ఓ మహిళపై కత్తితో దాడి చేసిన ఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై వేణుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మూతుల అంజిలమ్మ(45) ఈనెల 15న తెల్లవారుజామున తన ఇంట్లో నిద్రిస్తుండగా, అదే గ్రామానికి చెందిన వరప్రసాద్ దొంగతనం కోసం లోపలికి ప్రవేశించాడు. వస్తువుల శబ్దం రావడంతో మేల్కొన్న అంజిలమ్మ దొంగను చూసి గట్టిగా అరిచింది. దీంతో ఆగ్రహించిన వరప్రసాద్ తన వద్ద ఉన్న కత్తితో ఆమె గొంతు కోయడంతో తీవ్ర రక్తగాయమైంది. బాధితురాలు వెంటనే నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాధు మేరకు నిందుతుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై వేణు కుమార్ తెలిపారు.

## గ్రామ పంచాయతీ అబివృద్ధిపై అవగాహన

**దోమ,ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ పరిపాలన, అబివృద్ధి సర్పంచులు. ఉపసర్పం చులు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించుకోవాలని దోమ ఎంపిడిఓ గ్యామా అన్నారు. గురవారం నాడు దోమ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సర్పంచులు. ఉపసర్పంచులు ,పంచాయతీ కార్యదర్శులతోసమావేశం నిర్వహించారు. ఈ సందర్బముగ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారి చేసిన సూచనలమేరకు 15వ ఆర్థిక సంఘం నిదులు వినియోగం అబివృద్ధి, పరిపాలన అంశాలను ప్రతి ఒక్కరు గ్రహించుకోవాలని అన్నారు. నిదుల వినియోగం పర్యవేక్షణ, గ్రామస్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ఆడిట్ సంబందిత మార్గాలను సర్పంచులు, కార్యదర్శులు తెలుసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీలోరికార్డులు, సమగ్ర నిర్వహనను పాటించి అబివృద్ది పరుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమములో దోమసర్పంచ్ శివకుమార్‌రెడ్డి, గోడుగోనిపల్లి సర్పంచ్ దశరథ్‌రెడ్డి, బాస్పల్లి సర్పంచ్ అనంతయ్య, రాకొండ సర్పంచ్ ముచ్చందర్‌రెడ్డి, మోత్కూర్ సర్పంచ్ ఆనంద్‌కుమార్, దొంగయెన్కేపల్లి సర్పంచ్ వెంకటశ్రియారెడ్డి, లింగన్‌పల్లిసర్పంచ్ గోపాల్ ,బోంపల్లి పెద్దతాండా సర్పంచ్ గోపాల్‌నాయక్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు మొగులయ్య, ప్రదానకార్యదర్శి చంద్రశేఖర్, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమీక్ష

**దౌల్తాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారంరోజు దౌల్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి సమావేశం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొని అభివృద్ది పనులపై



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గాయత్రి

విస్తృతంగా చర్చించారు. గత కొన్ని రోజులుగా మండలంలో జరిగిన అభివృద్ధి పనులను సమీక్షించారు. గ్రామాల్లో పారిశుధ్యం, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల మెరుగుదలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల పార్టీ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విశ్వనాత్ పూర్‌లో సొంత డబ్బులతో బోర్ వేయించిన ఎమ్మెల్సీ

**కొందుర్గు ,ఏప్రిల్ 16:** ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్సీ నారకుంట నవీన్ కుమార్ రెడ్డి మండల పరిధిలోని విశ్వనాథ్పూర్ గ్రామంలో బోర్ నిర్మాణం చేయించారు. ఇటీవల తమ గ్రామంలో నీటి ఎద్దడి ఉందని గ్రామ సర్పంచ్ సుందు శ్రీలత రాములు ఎమ్మెల్సీను కలిసి విన్నవించారు. అందుకు స్పందించి ఆయన గురువారం నాడు బోరు బండిని పంపించారు. గ్రామ సర్పంచ్ శ్రీలత రాములు దగ్గరుండి బోర్నిర్మాణం చేయించారు. అందులో పుష్కలంగా నీరు రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్సీ చేసిన సహకారం ఎప్పటికీ మరువలేమని గ్రామస్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్. నాయకులు ఎదిరా రామకృష్ణ, బోడంపాటి రవీందర్ రెడ్డి, పిట్టల రమేష్ కోనేరు నర్సింగరావు, కమ్మదనం శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు చౌడాపురం ప్రభాకర్, దామోదర్ రెడ్డి, బాబురావు, గోపాల్నాయక్ తోపాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత మహిళపై దాడిచేసిన దుండగులను శిక్షించాలి

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** జిల్లెడు చౌదరి గూడ మండల పరిధిలోని ఎదిర గ్రామంలో దళిత మహిళపై దాడిచేసిన దుండగులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని జంగయ్య డిమాండ్ చేశారు. బాధితురాలికి తక్షణ సహాయం కింద పది లక్షల రూపాయలు ఇచ్చి ప్రభుత్వం వారి కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. పోలీస్ శాఖ ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెట్టి నిందితులకు కఠిన శిక్షలు వేస్తేనే భవిష్యత్తులో దళితులపై ఇలాంటి దాడులు జరగకుండా ఉంటాయన్నారు.

## ప్రభుత్వాసుపత్రి తనిఖీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ ఐఏఎస్ గురువారం వికారాబాద్ లోని ఎంసిహెచ్ సెంటర్ ను, తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. జిల్లాలోని వివిధ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి వస్తున్న శాంపిల్స్ వివరాలు ఎప్పటికప్పుడు అందజేస్తున్న పరీక్ష ఫలితాల గురించి పరిశీలించారు. అనంతరం హబ్‌లోని డయాగ్నస్టిక్ పరికరాలను వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా సేకరించిన శాంపిల్స్ పరీక్షి ంచి వెంటనే పేషంట్ కు సంబంధిత ఆసుపత్రి ద్వారా పరీక్ష ఫలితాలు అందజేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా శాంపుల్స్ సేకరణ పరిశీలించినప్పుడు పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గత కొన్ని నెలలుగా శాంపిల్స్ సేకరించడం లేదని అందుకు గల కారణాలు వారి నుండి వివరణ తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. టీబీ రోగనిర్ధారణ జరిగిన వెంటనే చికిత్స ప్రారంభించి పూర్తి కాలం చికిత్స తీసుకునే విధంగా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రతి టిబి రోగి యొక్క వివరాలను ఎప్పటికప్పుడు నిశ్చయ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధులు, క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. శిశు మరణాలను తగ్గించడం కోసం సంకల్ప కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, ఆసుపత్రుల జిల్లా సమన్వయ అధికారి సమీక్ష, సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. అనంతరం మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించడానికి నవజాత శిశు సంరక్షణ కేంద్రం, డెలివరీ రూమ్, పీడియాట్రిక్ వార్డు, స్కానింగ్ రూమ్, ల్యాబరేటరీ ని సందర్శించి అక్కడ అందిస్తున్న వివిధ రకాల సేవలను పరిశీలించారు. గర్భవతులకు, చిన్న పిల్లలకు ఏమాత్రం అసౌకర్యం కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కమిషనర్ తో పాటు టీబీ సంయుక్త సంచాలకులు డాక్టర్ రాజేశం, టీ హబ్ రాష్ట్ర సమన్వయ అధికారి డాక్టర్ నందిత ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి ,డీసీహెచ్ డాక్టర్ ఆనంద్, డిప్యూటీ డెమో వి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న రానరష్ట వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ సంగీత నారాయణ

## ప్రోటోకాల్ ఉల్లంఘన పై తహసీల్దార్‌ను నిలదీసిన కర్ణం కీర్తి రామకృష్ణ

**వికారాబాద్, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా స్థానిక ఎమ్మె ల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. అధికారిక కార్య క్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉండగా, పార్టీ నాయకులను వేదిక పైకి అధికారులు ఆహ్వానించడంతో పలువురు ప్రజాప్రతినిధులు అసహనానికి గుర య్యారు. ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకర్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నరోత్తం రెడ్డిలను వేదికపైకి అధికారులు ఆహ్వానించారు. ఈ విషయం పట్ల తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ల సంఘం ప్రధాన కార్యదర్శి, కోట్మొంద గ్రామ సర్పంచ్ కర్ణం కీర్తి రామకృష్ణ మోమిన్‌పేట్ తహసీల్దార్ రవీందర్‌ను నిలదీశారు. అధికారిక కార్యక్రమంలో పార్టీ నాయకులను వేదిక పైకి ఎలా ఆహ్వానిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ప్రజా ప్రతినిధులు వేదిక కింద ఉంటే..పార్టీ నాయకులు వేదిక పైకి ఎలా ఆహ్వానిస్తారని తహసీల్దార్ ను ప్రశ్నించారు.



ప్రోటోకాల్ విషయమై తహసీల్దార్ కు విన్నవిస్తున్న కీర్తి రామకృష్ణ

## అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డుల జారీ

..జిఓ 252లో అవసరమైన మేరకు సవరణలు చేస్తాం ..తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి
..మేడ్చల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులను జారీ చేస్తామని, జిఓ 252లో అవసరమైన మేరకు సవరణలు చేసి జిల్లాల డిపిఆర్ఓలకు పంపిస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ పుష్పకన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె.విరహత్ అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు జారీ చేసే అక్రిడిటేషన్ కార్డుల విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని అన్నారు. గతంలో కంటే మెరుగైన జీవోను ఈ ప్రభుత్వం తీసుకవచ్చిందని, సర్క్యులేషన్ ప్రాతిపదికన కార్డులను రాష్ట్ర, జిల్లా స్థాయిలో జారీ చేస్తామని అన్నారు. కేబుల్ చానల్ జర్నలిస్టులకు జారీ చేసే కార్డుల విషయమై సబ్ కమిటీ వేశామని అన్నారు. పెద్ద పత్రికల జర్నలిస్టులెవరికీ అన్యాయం జరగదని, ఆయా పత్రికల్లో డెస్క్ సబ్ ఎడిటర్లుగా పనిచేస్తున్న వారందరికి కార్డులు మంజూరు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌజింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చినటు వంటి ఇళ్ల స్థలాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు అభ్యంతరకరమైందని, ఐఏఎస్, ఐపిఎస్‌లు, ఎమ్మెల్యేల జీవితాలతో జర్నలిస్టులను పోల్చటం అభ్యంతరకరమైందని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జర్నలిస్టులు ఉన్నత వర్గాలు కాదని, ఇటీవల విజయవాడలో జరిగిన ఐజెయు ప్లీనరీ సమావేశంలో తీర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. అంతకు ముందు మూడు నెలల కాలంలో ప్రమాదాలు, అనారోగ్య కారణాల వల్ల మరణించిన 16మంది జర్నలిస్టులకు నివాళి అర్పించారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు కూడ వైద్య సదుపాయాన్ని కల్పించాలని, ఐజెయు ప్లీనరీ చేసిన తీర్మానం మేరకు హైదరాబాద్‌లో జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సును ఏర్పాటు చేయాలని, జాతీయ న్యూస్‌పేపర్స్ కన్ఫడరేషన్ జాతీయ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని తీర్మానించారు. జర్నలిస్టులపై నమోదు అవుతున్న కేసులపై నిజనిర్దారణ చేసేందుకు గాను త్రిసభ్య కమిటీని నియమించాలని సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు.




మేడ్చల్ జిల్లాలోని అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ లో జరిగిన రాష్ట్ర టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు కె.విరహత్‌అలీ, తదితరుల దృశ్యం

## అజ్మీర్ షరీఫ్‌కు మైనార్టీ యువత

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** జో వాదా కియా ఓ నిభానా పడేగా.. అంటూ ఎన్నికలకు ముందు 14వ వార్డులో యువతకు అజ్మీర్ షరీఫ్ దర్గా దర్శనం చేయిస్తానని మొక్కుకున్న షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ యువజన కాంగ్రెస్ నేత అందేమోహన్ ఎట్టకేలకు తన మాటను దక్కించుకున్నాడు. ఎన్నికలకు ముందు వార్డు యువతకు హామీ ఇచ్చిన అందేమోహన్ అనుకున్నట్టుగానే అజ్మీర్ షరీఫ్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాకు 13 మంది మైనార్టీ యువతను ప్రత్యేకంగా వాహన వసతి సౌకర్యాలను సమకూర్చి పంపారు. ఈ సందర్భంగా 13 మంది యువతకు మున్సిపల్ వైస్ చైర్మన్ అందేమోహన్ వీడ్కోలు ఇచ్చారు. అనంతరం అందేమోహన్ ఔదార్యానికి 14వ వార్డు మైనార్టీ యువత నాయకుడు



## బోంపల్లిలో హనుమాన్ బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు

**దోమ,ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మండల పరిదిలోని బోంపల్లి గ్రామములో గురువారం నాడు ఆంజనేయస్వామిదేవాలయము దగ్గర హనుమాన్ బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బముగ గ్రామములోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపారు. హనుమంతుడికి చందనం, అభిషేకం, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమములో అర్చకులు మనివర్ధన్, అనంతకృష్ణమూర్తి, శ్రీకాంత్, లక్ష్మీనరసింహ్మా పాల్గొని గ్రామస్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.




సభలో మాట్లాడుతున్న ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్

## ప్రజా పాలనకు మిశ్రమ స్పందన

ఎల్లంపేటలో భిన్న స్వరాలు

**మేడ్చల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట మున్సిపాలిటీలో నిర్వహించిన మున్సిపల్ స్థాయి సభకు మిశ్రమ స్పందన లభించింది ప్రభుత్వం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే వేదికగా సభలు నిర్వహిస్తూ ముందుకు పోతుంటే కార్యక్రమ నిర్వహణపై స్థానికంగా భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎల్లంపేట మున్సిపాలిటీలోని సోని కళ్యాణ మండపంలో మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి అధ్యక్షతన గురువారం మున్సిపల్ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ఆశించిన స్థాయిలో ప్రజల హాజరు లేకపోవడం చర్చనీయాంశమైంది. కొద్దిమంది మాత్రమే హాజరవ్వడం, సభ ప్రారంభమైన తర్వాత కూడా ఖాళీ కుర్చీలు కనిపించడం వల్ల కార్యక్రమం ఉత్సాహం కోల్పోయిందని స్థానికులు అంటున్నారు. సభను కొనసాగించేందుకు చివరికి డ్వాక్రా మహిళలను సమీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్‌లో ఇలాంటి వేదికలు ప్రజలకు మరింత ఉపయోగపడేలా మారాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్, తహసీల్దార్ భూపాల్, ఏడీఏ వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచు వివాహానికి సాయం

**షాద్‌నగర్ టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** నిరుపేద ఇంట వివాహానికి సాయం అందించేందుకు ఫరూక్ నగర్ మండలం పీర్లగూడ గ్రామ సర్పంచ్ షమీం బేగం ముందుకు వచ్చారు. గ్రామంలో ఏ ఇంట్లో ఆడపడుచు పెళ్లి అయిన వారికి 10000 రూపాయలు ఇచ్చేందుకు గ్రామ సర్పంచ్ షమీం బేగం ఆమె కుమారులు ఎంతో ఔదార్యంతో ప్రకటన చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన ముప్పిడి యాదమ్మ కూతురి వివాహం ఈనెల 30వ తేదీన నిశ్చయం అయింది. వివాహం నిమిత్తం తన వంతు సహాయంగా తన భర్త పేరు మీద రూ. 10,000 అందించారు. ఈ సందర్బంగా యాదమ్మ కుటుంబ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ప్రతి పేద ఇంటి బిడ్డకు పదివేల రూపాయలు తమ సొంతంగా అందిస్తామని సర్పంచ్ షమీ బేగం కుమారుడు నవాజ్ గోరీ తెలిపారు. కార్యక్రమంలో నవాజ్ గోరీ, చిక్కల సిద్దయ్య, గుంటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

**మేడ్చల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవల్లి గ్రామంలో గల సాకేత్ ప్రణామం అపార్ట్మెంట్‌లో శామీర్‌పేట అగ్నిమాపక స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శామీర్‌పేట అగ్నిమాపక కేంద్రం అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ధనుంజయ్ రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివప్రసాద్ హాజరై నివాసితులకు అగ్ని ప్రమాదాల అప్రమత్తతపై కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా వంటగదిలో గ్యాస్ సిలిండర్ల వాడకం, గ్యాస్ లీకైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ల నివారిణ గురించి వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే 101 నంబర్‌కు సమాచారం అందించాలని, ప్రతి ఒక్కరూ అగ్ని భద్రతపై కనీస అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహనరావు, కార్యదర్శులు వల్లభేంద్రరెడ్డి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



ఫైర్ స్టేషన్ అధికారి

## మహిళపై దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 16,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎదిర గ్రామానికి చెందిన రాపోలు శోభపై దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టి అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన బందయ్య, అంజయ్య, అశోక్, మొగులయ్యలపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పెర్కొన్నారు.